క్లుప్తంగా

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు సన్మానం



దయాకర్‌ను సన్మానించిన కమలాకర్

మల్లాపూర్: ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు అండగా నిలిచిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆదివారం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎల్కా కమలాకర్ సన్మానించారు. ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. అద్దంకి దయాకర్‌ని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని పేర్కొన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సురేశ్‌బాబు

కోరుట్ల: గణేష్ నిమజ్జనం శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ సురేశ్ బాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెప్టెంబర్ 6 వ తేదీన కోరుట్లలో నిమజ్జనోత్సవం ఉంటుందని ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం. చిరంజీవి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంధత్వాన్ని రూపుమాపేందుకే కంటి వైద్యశిబిరం



కంటి ఆపరేషన్ చేసుకున్న వారితో లయన్స్‌క్లబ్ సభ్యులు

మల్లాపూర్: కంటి వైద్యశిబిరాలతో అంధత్వాన్ని రూపుమాపుతున్నామని మెట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాస్‌రావు అన్నారు. కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్స పూర్తి చేసుకుని వచ్చిన వృద్ధులను ఆదివారం మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో వారిని స్వగృహాలకు తరలించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ కార్యదర్శి సురకంటి జైపాల్‌రెడ్డి, కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్, రేకుర్తి కంటి వైద్యుడు డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న 11 మందిని ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ. 95,150 స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ విద్యానగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పైప్‌లైన్ కోసం తవ్వారు .. పైపులు వేయడం మరిచారు



పైప్‌లైన్ వేయని మార్కెట్ ఏరియా

రాయికల్: రాయికల్ బల్దియాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మార్కెట్ ఏరియా మార్కండేయ కాలనీలో పైప్‌లైన్ వేయడం కోసం గత నెల రోజుల క్రితం కాంట్రాక్టర్ తవ్వించగా పైప్‌లైన్ వేయకపోవడంతో ఆ కాలనీలో తరచూ ప్రమాదాలు గురవుతున్నారు. అంతే కాకుండా రాకపోకలకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ స్పందించి పైప్‌లైన్ కోసం తవ్విన ప్రదేశాల్లో పైప్‌లైన్ వేసి పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



జగిత్యాల రూరల్ : పూజల్లో పాల్గొన్న భక్తులు



రాయికల్‌లో వినాయక మందిరంలో జీవన్‌రెడ్డి పూజలు

అన్నదానాలు.. ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్/రాయికల్/కథలాపూర్/మెట్‌పల్లి/మేడిపల్లి/మల్లాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఐదోరోజు మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో భక్తులు నాయకులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో పూజలు చేస్తున్న మహిళలు



కథలాపూర్‌లో కుంకుమపూజల్లో మహిళలు

దెబ్బతిన్న పోచంపేట-లచ్చక్కపేట రోడ్డు



కంకర తేలిన పోచంపేట-లచ్చక్కపేట రోడ్డు

సారంగాపూర్: మండలంలో వర్షాలకు పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పోచంపేట-లచ్చక్కపేట గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసిన సింగిల్ లైన్ తారు రోడ్డుపై నుంచి ఇటీవల వర్షాలకు భారీ వరద నీరు ప్రవహించడంతో రోడ్డుపై తారు కొట్టుకుపోయింది. కంకర తేలి గుంతల మయంగా మారింది. మధ్యలో ఉన్న లోలెవల్ వంతెన ప్రాంతం దెబ్బతింది. రెండు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా పలు చోట్ల దెబ్బతింది. సారంగాపూర్ ఎంపీడీవో చౌడారపు గంగాధర్ రోడ్డును పరిశీలించి, తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను ఫోన్‌లో కోరారు.

అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు సాగాలి



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న పులి గోవర్ధన్

జగిత్యాలటౌన్: అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ పులి గోవర్ధన్ పిలుపునిచ్చారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి గోవర్ధన్ ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలతీతంగా సామాజిక న్యాయంతో పాటు దేశ ప్రజల హక్కులకు రాజ్యాంగ రక్షణ కల్పించిన అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్మరణ కార్యక్రమ నిర్వాహకులు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, అనంతుల కాంతారావు, బొల్లం రమేశ్ అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం





జగిత్యాల, ధర్మపురిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల/ధర్మపురి/కోరుట్లటౌన్/మెట్‌పల్లి/పెగడపల్లి: బీహార్‌లో ప్రధాని మోదీ తల్లిపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ జిల్లాలోని పలు చోట్ల బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రం, పెగడపల్లి,ధర్మపురి, రాయికల్,కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో మెట్‌పల్లి పట్టణంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బీసీలకు రాజ్యాధికారం రావాలి



పోరుబాట పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వెల్గటూర్: బీసీలకు రాజ్యాధికారం వస్తే తప్ప బీసీల బ్రతుకులు మారవని ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేష్‌బాబు అన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి రాసిన ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్ష సమావేశం మండల ఓబీసీ ముఖ్య నాయకులు గోపతి జనార్దన్ ఆధ్వర్యంలో ఆదివారం వెల్గటూర్‌లో నిర్వహించారు. ప్రభుత్వాలు మారుతున్నా బీసీల బ్రతుకులు మారడం లేదని, అగ్రవర్ణాల చేతిలో అధికారం ఉన్నంత కాలం బీసీల బ్రతుకులు మారవని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో నాగరాజు, నాయకులు కొత్త నర్సింహులు, మల్లేష్ యాదవ్, మల్లేశం, కొండన్న, బందెల రమేష్, గట్ల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న బ్యాంక్ మేనేజర్, సామాజిక సేవకుడు రమేశ్

సారంగాపూర్: నిరుపేద దళిత కుటుంబం...దేవుడు ఆ కుటుంబ పెద్దకు పెద్ద కష్టం వచ్చి వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. విషయం తెలుసుకున్న ధర్మపురికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ తన ఫేస్‌బుక్ మిత్రులతో రూ. 1.22 లక్షల సాయం అందించి, ఆ కుటుంబానికి బాసటగా నిలిచాడు. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన నలువాల రాయపోచయ్య-గంగరాజు వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరు కూలిపనిచేసుకుంటూ పెద్ద కూతురుకు నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. రెండో కూతురుకు వివాహం చేయాల్సి ఉంది. కాగ మూడేళ్ల క్రితం ఇంటి పెద్ద రాయపోచం రెండు కిడ్నీలు పూర్తిగా పాడైపోయాయి. అప్పటి నుండే రాయపోచం కుటుంబానికి ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నీలకు డయాలసిస్ జరుగుతున్నప్పటికీ, మందులు, రవాణా ఇతర ఖర్చులతో రాయపోచం కుటుంబానికి మరిన్ని ఆర్థిక సమస్యలు తెచ్చిపెట్టాయి. విషయం తెలుసుకున్న సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ రాయపోచం ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ సాయం చేయాలని ఆగస్టు 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేయగా దాతలు స్పందించి రాయపోచయ్య భార్య గంగరాజు ఖాతాకు రూ. 1.22 లక్షలు విరాళాలు అందించారు. ప్రస్తుతం వైద్య ఖర్చులకు వాటిలో నుండి కొంత మొత్తాన్ని జగిత్యాల బ్యాంక్ అధికారుల చేతుల మీదుగా గంగరాజుకు అందించి, మిగతా డబ్బులు ఆమె ఖాతాల్లో నిల్వ ఉంచినట్లు రమేష్ తెలిపాడు.

మిచ్చమ్మకు నివాళి

ఇబ్రహీంపట్నం: మండల శివారులో మిచ్చమ్మ అనాథ ఆశ్రమంలో మిచ్చమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం నివాళి అర్పించారు. మిచ్చమ్మ పేరిట ఆశ్రమం ఏర్పాటు చేసి ఆశ్రమంలో తల్లిదండ్రులు లేని పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు మాజీ జెడ్పీటీసీ సునీత, డాక్టర్ జె ఎస్ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, నందగోపాల్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

కోరుట్లటౌన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులను అలీ ఫౌండేషన్ కోరుట్ల ఆధ్వర్యంలో స్థానిక ఓ హాలులో ఆదివారం సన్మానించారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఉత్తమ విద్యార్థులకు మెమొంటో, అవార్డు, నగదు బహుమతి అందజేశారు. అదే విధంగా ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ అధికారి, ఉత్తమ సామాజిక కార్యకర్త, ఉత్తమ మౌజన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ బి. సురేష్‌బాబు, అలీ ఫౌండేషన్ కోరుట్ల అధ్యక్షుడు మసూద్ అలీ, చీఫ్ ప్యాట్రాన్ ఎండీ ఇక్బాల్ అలీ,ప్రతినిధులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి, కోమటి కొండాపూర్ గ్రామాల్లో ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేయడంతో నీట మునిగిన పంట పొలాలను కాంగ్రెస్ నేత జువ్వాడి కృష్ణారావు ఆదివారం పరిశీలించారు. పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డబ్బా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అమ్మక్కపేటలో వినాయక మండపాల వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొరిగం రాజు, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడలు

కథలాపూర్: కథలాపూర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 3, 4 తేదీల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) మండలస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. 3న బాలికలు, 4న బాలురకు క్రీడలు నిర్వహిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు చొరవ చూపి ఆయా తేదీల్లో విద్యార్థులు క్రీడలకు హాజరయ్యేలా చూడాలని ఎంఈవో శ్రీనివాస్ కోరారు.

ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



పోలీస్ స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు

మల్యాల: అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్ తరలివెళ్తున్న ఆశ కార్యకర్తలను ఎస్సై నరేశ్‌కుమార్ మల్యాల అంగడి బజార్ వద్ద ముందస్తుగా అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి, తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తారన్న సమాచారంతో ఆశ కార్యకర్తలను ఆదివారం ఉదయం నుంచే ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు శారద, సభ్యులు పాల్గొన్నారు.

బతకాలన్న ఆశ చిగురించింది..



మల్యాల: మర్రి చెట్టు కాండం పూర్తిగా కాల్చివేసినా, కాండం మరో అంచు చివరన కొమ్మ చిగురిస్తోంది. దశాబ్దాల తరబడి రోడ్డు వెంట వెళ్లే ఎన్నో వాహనాలకు, పాదచారులు, స్థానికులకు వాన, ఎండలకు గొడుగై కాపాడింది. రెండేళ్ల క్రితం మల్యాల మండలం రాజారం గ్రామంలో రోడ్డు పక్కన దశాబ్దాల నాటి మర్రిచెట్టు చెట్టు కాండంలో బొరియపడి నేలకొరిగింది. దీంతో చెట్టు కొమ్మలు పూర్తిగా తొలగించి, చెట్టు బొరియను కాల్చివేసినప్పటికీ, మర్రిచెట్టు కొమ్మ చిగురిస్తూ, కాల్చినా మీ నీడ కోసమే మళ్లీ చిగురిస్తున్న అన్నట్లుగా, మర్రికొమ్మ పెరుగుతోంది.



సారంగాపూర్: ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల మీదుగా జన్నారం (మంచిర్యాల జిల్లా) ఈ మూడు మండలాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారుల్లో పూర్తిగా రోడ్డును ఆనుకుని ఊరకుంట ఉంది. కుంట నిండా ఎప్పుడు నీరు నిండి ఉంటుంది. ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేసిన కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రమాదకరంగా ఉన్న కుంట వెంట తక్షణమే రక్షణ గోడ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్,ఏఈ, ఆర్‌అండ్‌బీ, సారంగాపూర్ సెల్ నంబర్: 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రాజ్యాంగ ఫలాలు అన్నివర్గాలకూ అందాలి

- బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ బీఎన్.రావు



మాట్లాడుతున్న బీఎన్.రావు

మల్యాల: రాజ్యాంగ ఫలాలు అన్నివర్గాలకు అందాలని బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీఎన్.రావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నిరుపేద మహిళలకు ఫౌండేషన్, న్యాయవాది గండ్ర మోహన్‌రావు ఆధ్వర్యంలో న్యాక్ చొరవతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మండలకేంద్రంలో ప్రారంభించారు. మహిళలకు నోటుబుక్కులు, పెన్నులు అందించారు. అనంతరం మాట్లాడుతూ చదివే చదువుకు.. చేసేపనికి పొంతన లేకుండాపోతోందని, యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారి అభిరుచులకు అనుగుణంగా ఉపాధి కల్పించాలని సూచించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ఫౌండేషన్ కృషి చేస్తోందని, మల్యాల, గంగాధర, హుజూరాబాద్, సిరిసిల్లలో కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు బీఎన్‌రావు ఫౌండేషన్ కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, శిక్షకురాలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

కోరుట్లటౌన్: ఆసరా పెన్షన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి కొమ్ము శేఖర్, మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్పల్లి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లిలో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో బీడీ కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలి

సారంగాపూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి మీసాల సాయిలు అన్నారు. ఆదివారం సారంగాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాత పెన్షన్ల పెంపుతో పాటు, కొత్త పింఛన్ల మంజూరీపై రాయికల్‌లోని శివాజీ రెడ్డి గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభకు వస్తున్నారని పేర్కొన్నారు.

పోతారంలో గాజుల పండుగ

కథలాపూర్: మండలంలోని పోతారంలో మహిళలు గాజుల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మహిళలు సమావేశమయ్యారు. మహిళలు ఒకరికొకరు గాజులు వేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

గోరింటాకు సందడి

కోరుట్లటౌన్: పట్టణంలోని ఝాన్సీరోడ్‌లో గణేశ్ నవదుర్గా మండలి, త్రిశక్తిమాత సేవా సమితి ఆధ్వర్యంలో త్రిశక్తి ఆలయంలో మహిళలు గోరింటాకు సంబరాలు ఆదివారం జరుపుకున్నారు. పెద్ద ఎత్తున మహిళలు దుర్గామాతను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహికంగా గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు.

రామకృష్ణ, చిందం సునీతకు జాతీయ స్థాయి పురస్కారం

జగిత్యాలటౌన్: ఆచార్య కె రామకృష్ణ, డా చిందం సునీతలకు జాతీయ స్థాయి తెలుగు తేజం అవార్డు అందజేశారు. ఐఎస్‌వో గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేటలో తెలుగు బాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసినందుకు గాను ఇరువురికి పురస్కారాలు అందజేశారు.

డాక్టర్లకు సన్మానం

జగిత్యాలజోన్: జిల్లా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ల దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కొప్పెర వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెడ్లు తాము అభివృద్ధి చెందడమే కాకుండా, తమ చుట్టు ఉన్న వారు కూడా అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు మోహన్ రెడ్డి, వెంకట్రాజిరెడ్డి, శైలేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు రాంచంద్రారెడ్డి, రాంరెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పోపా పట్టణాధ్యక్షుడిగా దాసరి రామస్వామి

రాయికల్: రాయికల్ పట్టణ పోపా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి రామస్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీపతి రాఘవులు, ఉపాధ్యక్షులుగా సామల్ల గంగాధర్, మాచర్ల స్వప్న, ప్రధాన కార్యదర్శిగా సిరిపురం మహేశ్, సంయుక్త కార్యదర్శిగా రాందాస్, కార్య నిర్వాహక కార్యదర్శిగా దావనపెల్లి సురేందర్, ప్రచార కార్యదర్శిగా ఉషకోల రాము, కోశాధికారిగా దాసరి కృష్ణహరి, కార్యవర్గ సభ్యులుగా కడకుంట్ల జగదీశ్వర్, చిలుక సత్యం, కడకుంట్ల అభయ్ రాజ్, దాసరి ఉమాదేవి, ఆడెపు సుజాత, కస్తూరి రేవతి, సాంస్కృతిక కార్యదర్శిగా బాలె దేవేందర్, క్రీడల కార్యదర్శిగా తాటిపాముల శ్యాంను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కోరుట్లటౌన్: దూదేకుల నూర్‌బాషా సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.డీ రహీంపాషా, కార్యదర్శిగా ఎం.డీ అన్వర్, కోశాధికారిగా మహమ్మద్ ఖుద్దూస్ ఎన్నికైనట్లు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు ఎం.డీ.రహీంపాషా అన్నారు. అనంతరం నూతన కార్యవర్గంను సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ల నియామకం

కథలాపూర్:యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్‌గా కలిగోట గ్రామానికి చెందిన మనత్తుల కొమురయ్య, కో-కోఆర్డినేటర్‌గా తాండ్ర్యాల గ్రామానికి చెందిన పానుగంటి శ్యామ్‌ను నియమించారు. తమ నియామకానికి కృషి చేసిన యూత్ కాంగ్రెస్ జిల్లా, రాష్ట్ర నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.